అక్రమ దందా..ఆపేదెవరు!

- జిల్లాలో జోరుగా పీడీఎస్ దందా
- డబ్బులిచ్చి బియ్యం కొనుగోలు చేస్తున్న డీలర్లు
- పొరుగు రాష్ట్రానికి తరలించి సొమ్ము చేసుకుంటున్న వైనం



కాగజ్‌నగర్‌లో ఇటీవల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్న అధికారులు

పేదల కడుపు నింపాల్సిన బియ్యం అక్రమార్కుల జేబులు నింపుతున్నాయి. తిలా పాపం తలా పిడికెడు అన్న చందంగా.. ఇందులో అందరికి వాటాలు ఉండటంతో రాయితీ బియ్యం పొరుగున ఉన్న మహారాష్ట్రలోని ఆయా గ్రామాలకు వెళ్లడం నిత్యకృత్యంగా మారింది. దళారులతోపాటు రేషన్ డీలర్లు సైతం లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి దందాను కొనసాగిస్తున్నారు.

కౌటాల: జిల్లాలో పీడీఎస్ బియ్యం దందాను అరికట్టడం కోసం అధికారులు, పోలీసుశాఖ చేస్తున్న ప్రయత్నాలకు రేషన్ డీలర్లే గండికొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దందా జోరుగా సాగుతోంది. ప్రతీనెలలో పీడీఎస్ బియ్యం అక్రమ తరలింపు కేసులు నమోదు కావడం చూస్తుంటే ఈ దందా ఏ మాత్రం సాగుతుందో అర్థమవుతోంది. అధికారులు తనిఖీలు చేపడుతున్నా.. కొత్తదారిలో ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతీనెల జిల్లాలో అక్రమ బియ్యం దందా రవాణా కేసులు ఆరు, ఏడు నమోదవుతున్నాయి.

రూ.18 ఇచ్చి..రూ 30కి విక్రయం!

అనేకమంది లబ్ధిదారులకు దుకాణాల వద్దే రేషన్ డీలర్లు నేరుగా కిలో రూ.16 నుంచి రూ.18 వరకు డబ్బులు ఇచ్చేస్తున్నారు. 15–20 క్వింటాళ్ల వరకు పోగు చేసి మహారాష్ట్రలో రూ.26 నుంచి రూ.30 వరకు విక్రయిస్తున్నారు. ఇక్కడ పాలిష్ చేసి, ప్యాక్ చేసి ఇతర ప్రాంతాలకు అమ్ముతున్నారనే ఆరోపణలున్నాయి. కాగజ్‌నగర్ అడ్డాగా ఇటు మంచిర్యాల, బెల్లంపల్లి, రెబ్బెన నుంచి, మరోవైపు ఆసిఫాబాద్ నుంచి సిర్పూర్(టి) మీదుగా చౌకబియ్యాన్ని పొరుగుకు వెళ్తున్నాయి. ఈ బియ్యం తరలింపు ప్రతినెలా రెండు, మూడు తేదీల నుంచి 20వ తేదీ వరకు (బియ్యం ఇచ్చే తేదీల్లో) కొనసాగుతుంది. మార్గమధ్యలో ఎవరైన అడ్డుచెబితే చేతులు తడిపితే చాలు..వాహనాలు నేరుగా తెల్లవారుజాము, రాత్రి వేళల్లో అధికంగా పొరుగు రాష్ట్రానికి పరుగులు తీస్తాయి.

జిల్లా వివరాలు	
మండలాలు:	15
పంచాయతీలు:	334
చౌకధరల దుకాణాలు:	303
మొత్తం ఆహారభద్రత కార్డులు:	1,39,784
అంత్యోదయ కార్డులు:	13,024
అన్నపూర్ణ కార్డులు:	21
ప్రతినెల బియ్యం పంపిణీ:	3 వేల మెట్రిక్ టన్నులు

కొత్త దందా..!

చౌకధరల దుకాణాల ద్వారా ఇస్తున్న బియ్యం పక్కదారి పట్టకుండా లబ్ధిదారులకే అందేలా ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. ×ఒకే దేశం.. ఒకే కార్డు९విధానంతో ఎక్కడి వారైనా తాము ప్రస్తుతం ఉంటున్న ప్రాంతంలో తీసుకునే వెసులుబాటును కల్పించింది. కానీ రేషన్ డీలర్లే నేరుగా లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి దందాను కొనసాగిస్తున్నారు. జిల్లాలో చాలావరకు బడాబాబులకు రేషన్‌కార్డులున్నాయి. అప్పట్లో ఆరోగ్యశ్రీ కోసం వీరంతా కార్డులు పొందారు. వీరిలో కార్డులు పొందారు. ఇందులో చాలామంది నేరుగా రేషన్ షాపులకు వెళ్లి బియ్యం తీసుకోవడం లేదు. అలాంటి వారినే డీలర్లు లక్ష్యంగా చేసుకుంటున్నారు. వారితో వేలిముద్ర వేయించి నేరుగా అక్కడి నుంచే పీడీఎస్ బియ్యాన్ని బొలెరో వాహనాల్లో తరలిస్తున్నారు. గతంలో లబ్ధిదారులు ఇళ్ల వద్దకు వెళ్లి ఏజెంట్లు బియ్యం సేకరించేవారు. కానీ ఈ దందా విస్తరించిన క్రమంలో నేరుగా రేషన్ షాపుల నుంచే సేకరించే స్థాయికి చేరుకుంది.

రాత్రివేళల్లో తరలింపు

రేషన్‌డీలర్లు లబ్ధిదారులకు రూపాయికి బియ్యం ఇచ్చినట్లే ఇచ్చి.. తిరిగి కొనుగోలు చేస్తున్నారు. క్వింటాళ్ల కొద్ది జమ అయ్యాక రాత్రివేళలో ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తతంగం సివిల్ అధికారులకు తెలిసినా ×మామూళ్ల९అందుతుండడంతో అటువైపు కన్నెత్తి చూడట్లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



కర్జి నుంచి మొట్లగూడకు మట్టి రోడ్డు

మట్టి రోడ్డుతో ఇబ్బందులు

దహెగాం: గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. మండలంలోని కర్జి నుండి మొట్లగూడ గ్రామం వరకు మట్టి రోడ్డే దిక్కయింది. కర్జి ప్లాంటేషన్ నుంచి మొట్లగూడ రావులపల్లి క్రాసింగ్ వరకు వర్షాకాలంలో రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. గత ఐదేళ్ల క్రితం బీటీ నిర్మాణానికి నిధులు మంజూరైనా అటవీ ప్రాంతం కావడంతో అనుమతులు లేక పనులు ప్రారంభం కాలేదు. మొట్లగూడ, రాంపూర్, రావులపల్లి, దిగిడ, టేపర్‌గాం గ్రామాల ప్రజలు నిత్యం ఈ రోడ్డుగుండానే ప్రయాణం చేస్తుంటారు. పలుమార్లు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పంటకు బోనస్ చెల్లించాలి

బోథ్: రైతులు పండించిన పంటకు ప్రభుత్వం బోనస్ చెల్లించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బోథ్ మండల కేంద్రంలో తహసీల్దార్ సుభాష్ చందర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నికల హామీలో భాగంగా ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి రైతులు పండించిన పంటకు క్వింటాలుకు రూ.500 బోనస్‌గా, రైతుభరోసా ద్వారా ఎకరాకు రూ. 15 వేలను అందించాలని కోరారు. అమలుకాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల రైతు సంఘం అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, శ్రీధర్ రెడ్డి, ప్రశాంత్, సత్యనారాయణ, సుభాష్, స్వామి, సురేశ్, లింగారెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా ‘అరిగెల’ జన్మదిన వేడుకలు



అభిమానుల మధ్య అరిగెల జన్మదిన వేడుకలు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ జెడ్పీటీసీ, బీజేపీ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో నాయకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయన్ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోత్తపల్లి శ్రీనివాస్, ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు కోట్నాక విజయ్, ఖాండ్రె విశాల్, వివిధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

కౌటాల: ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని హెచ్‌ఈఓ సోనాజీ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా గురువారం కౌటాల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంగీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దోమకాటుతో డెంగీ సోకుతుందని, ఇంటి పరిసరాల్లో నిల్ల నీటిని తొలగించాలన్నారు. గ్రామాల్లో వీధులు, మురుగు కాల్వల్లో చెత్తాచెదారం తొలగించాలని, వర్షాలకు ముందు తర్వాత కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. స్టాఫ్‌నర్స్ సునీత, సిబ్బంది సవిత, పెంటుబాయి తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వైద్యుడు వినయ్ ఉప్రె

వాంకిడి: ప్రతి ఒక్కరూ డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి వినయ్ ఉప్రె అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం అవగాహన కల్పించారు. ఏ డిస్ ఈ జిప్టి అనే దోమకుట్టడం వల్ల డెంగీ సోకుతుందని, జ్వరం, తల, కీళ్ల నొప్పులు, ఆకలి మందగించడం, వాంతులు వంటి లక్షణాలు కన్పిస్తాయని తెలిపారు. వర్షాకాలంలో దోమల వ్యాప్తి నేపథ్యంలో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి పెందోర్ రవిదాస్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పెర్సాపేన్ పూజకు కాలినడకన..

కెరమెరి: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన గిరిజన ఆదివాసీలు కాలినడకన సాంగ్వి అడవుల్లో ఉన్న పెర్సాపేన్(పెద్దదేవుడు) పూజ కోసం గురువారం బయల్దేరారు. డోలు వాయిస్తూ దేవుళ్లను గంపల్లో పెట్టుకుని సంప్రదాయ బద్ధంగా బయలేదేరి వెళ్లారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పంటలు పండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని మొక్కుకున్నట్లు పటోదాలు తెలిపారు. రాత్రి అక్కడే బస చేసి శుక్రవారం రాంపూర్‌కు బయల్దేరనున్నారు.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

- పంచాయతీల్లో కానరాని తడి,పొడి చెత్త సేకరణ
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం



నిరుపయోగంగా పెద్ద సిద్దాపూర్ సెగ్రిగేషన్ షెడ్డు

బెజ్జూర్: చెత్తతో సంపద సృష్టిపై పట్టింపు కరువైంది. గ్రామాల్లో గత ప్రభుత్వం నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. పంచాయతీల్లో నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుపోతోంది. మండలంలో మొత్తంలో 22 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో 22 సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా ఒక్కో నిర్మాణానికి సుమారు రూ.2.5 లక్షలు చెల్లించారు. కాగా, ప్రస్తుతం ఆయా గ్రామాల్లో షెడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. సెగ్రిగేషన్ షెడ్లు గ్రామాలకు దూరంగా ఉండడం, ఆయా చోట్ల తగినంత ఇబ్బంది లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ కొరవడం తదితర కారణాలు లక్ష్యానికి అవరోధంగా మారుతున్నాయి. సాధారణంగా గ్రామాల్లో సేకరించిన చెత్తను తడి, పొడి వేరుచేసి షెడ్డులో ఎరువు తయారు చేయాలి. ఇలా తయారైన ఎరువును గ్రామ పంచాయతీలు విక్రయించి ఆదాయాన్ని పెంచుకోవాలనేది వీటి ఉద్దేశం. కానీ పంచాయతీల్లో సిబ్బంది సేకరించిన చెత్తను మొత్తం డంపింగ్ యార్డు వద్దకు ట్రాక్టర్ ద్వారా తీసుకెళ్లి నిప్పుపెడుతున్నారు. కాలుతున్న వ్యర్థాల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో ప్రజలు రోగాల బారినపడే అవకాశాలు ఉన్నాయి.

నిరుపయోగంగా..

మండలంలో 22 పంచాయతీలు ఉండగా, గత ప్రభుత్వం ఒక్కో పంచాయతీకి ట్రాక్టర్, నీటి ట్యాంకర్ కేటాయించింది. గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు చెత్తబుట్టలు పంపిణీ చేసింది. తడి,పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించకపోవడంతో గ్రామాల్లో ఎరువులు తయారు చేసినా దాఖలాలు లేవు. కొన్ని పంచాయతీల్లో ఒకే స్థలంలో శ్మశానవాటిక, కంపోస్ట్ షెడ్లు నిర్మించారు. సేంద్రియ ఎరువులు తయారు చేసేలా నిర్మించిన కంపోస్ట్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. సర్పంచుల పదవీకాలం ముగిసి ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. ప్రత్యేక అధికారుల పాలనలోనైనా కంపోస్ట్ షెడ్లపై దృష్టిసారించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టింపు కరువు

సలుగుపల్లి, పెద్ద సిద్దాపూర్ పంచాయతీ పరిధిలోని మూడు పల్లె ప్రకృతివనాలకు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ వైర్, కొన్ని సిమెంట్ స్తంభాలు ఇదివరకే చోరీకి గురైన విషయం తెలిసిందే. దీనిపై ఇప్పటివరకు సంబంధిత అధికారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వకపోవడంతోపాటు దొంగలించిన వ్యక్తులను పట్టుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. లక్షలు విలువ చేసే ప్రభుత్వ సొమ్ము చోరీ జరిగి నెలలు గడుస్తున్నా అధికారులకు కనువిప్పు కాకపోవడం ఏమిటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదు తీసుకోవడం లేదు

ఫెన్సింగ్ వైరు దొంగతనం జరిగిందని సలుగుపెల్లి పంచాయతీ కార్యదర్శి దుర్గయ్య బెజ్జూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే తీసుకోలేదు. ఎరువుల తయారీపై అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నాం. త్వరలో తడి, చెత్త పొడి చెత్త సేకరణ ప్రారంభిస్తామని బెజ్జూర్ ఎంపీవో రమేశ్‌రెడ్డి వివరించారు.

కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వం



రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వమని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు లెండుగురే శ్యాంరావు అన్నారు. రేవంత్‌రెడ్డి అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు గురువారం కాగజ్‌నగర్ మండలంలోని వంజిరి సమీపంలో కాగజ్‌నగర్–ఆసిఫాబాద్ రహదారిపై పార్టీ నాయకులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం కోసం కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదన్నారు. రైతులకు రూ.500 బోనస్ ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు నక్క శంకర్, మొహిన్, రాజుకుమార్, బండు పటేల్, శంకరయ్య, ముక్తేశ్వర్, శంకర్, అంజన్న, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

కథల పుస్తకాలు చదవాలి

ఇచ్చోడ: కథలతో కూడిన పుస్తకాలు చదవడంతో విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందని రూమ్‌టు రీడ్ కోఆర్డినేటర్ ఉదయశ్రీ అన్నారు. గురువారం ఇచ్చోడలో విద్యార్థులతో మాట్లాడారు. వేసవిలో పఠనాభివృద్ధిని పెంపొందించడానికి రూమ్‌టు రీడ్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థులు 040– 45209722 నంబర్‌కు ఫోన్ చేసి రోజుకు ఒక కొత్త కథ వినే అవకాశాన్ని కల్పించామన్నారు. సీఆర్పీ శ్యాంసుందర్, అమ్మఆదర్శ కమిటీ సభ్యులు ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని చెక్‌పోస్టు, రాజంపేట, పొట్టి శ్రీరాములు చౌక్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సదాశివ్ ఓ ప్రకటనలో తెలిపారు. 31 కేవీ లైన్‌లో ట్రీ కటింగ్, లూజ్ లైన్స్ మరమ్మతు దృష్ట్యా సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

గుండెపోటుతో హెల్త్ అసిస్టెంట్ మృతి



కమలాకర్(ఫైల్)

మంచిర్యాలటౌన్: మంచి ర్యాలలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో లైజ నింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న అవదూత కమలాకర్(48) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ, ఆ జిల్లా నుంచి మంచిర్యాల ఎంసీహెచ్‌కు వచ్చే గర్భిణులకు దిశా నిర్దేశం చేసేందుకు డిప్యూటేషన్‌పై ఎంసీహెచ్‌లో లైజ నింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. జి ల్లా కేంద్రంలోని రాముని చెరువు కట్టపై సీని యర్ వాకర్ సభ్యుడిగాను గుర్తింపు పొందిన ఆయన మృతిపై రామునిచెరువు వాకర్ అసో సియేషన్ ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు.

ప్రతి కూలీకి పని కల్పించాలి

నేరడిగొండ: ప్రతి కూలీకి పని కల్పించాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. మండలంలోని కుంటాల(బి) గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను గురువారం పరిశీలించారు. పనుల ప్రదేశంలో నీటి సౌకర్యంతోపాటు ఫస్ట్ ఎయిడ్‌కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఎండల కారణంగా ఉదయం పనులకు వెళ్లాలని సూచించారు. ఎలాంటి అవకతవకలకు ఉపాధిహామీ అధికారులు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావు, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

సమన్వయంతో పనులు చేయాలి



మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో నాగేశ్వర్‌గౌడ్

కెరమెరి: అటవీశాఖ, ఉపాధి హామీ పథకం అధికారులు సమన్వయంతో పనులు చేయాలని ఎఫ్ఆర్వో నాగేశ్వర్‌గౌడ్, ఎంపీడీవో క్రిష్టారావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజలకు ఉపయోగకరమైన, అనువైన పనులు చేసుకోవాలన్నారు. రిజర్వ్ ఫారెస్టుల్లో సీసీటీ, ఫారంపాండ్, చెక్ డ్యాంలు తదితర పనులు ఉంటాయని పేర్కొన్నారు. గ్రామాల్లో కూలీలు అధికంగా పనులు చేసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. వడదెబ్బలు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఎంపీవో అంజద్ పాషా, డీఆర్వో సుజాత, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, గ్రామ కార్యదర్శులు, ఉపాధి టీఏ, ఎఫ్ఏలు ఉన్నారు.

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ

బెజ్జూర్: క్రీడాకారులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొని మరింతగా రాణించాలని జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, ఎంపీటీసీ పర్వీన్ సుల్తాన అన్నారు. మండలంలోని ఎలకపల్లి గ్రామంలో సాఫ్ట్‌బాల్ సమ్మర్ క్యాంప్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో క్రీడాకారులను వెలికితీసేందుకు ఉచిత సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేసిన బెజ్జూర్ కేజీబీవీ పీఈటీ చెంచులక్ష్మితోపాటు సాఫ్ట్‌బాల్ జిల్లా సెక్రెటరీ కిరణ్ కుమార్‌ను అభినందించారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ వెంకన్న, టి.సునీత, నాయకులు జావిద్, మహేశ్, రామకృష్ణ, భీంరావు, సురేష్, వైకుంఠం, శ్రీకాంత్, అరుణ్, భీమన్న, తిరుపతి, రోశయ్య, బక్కన్న రాజు పాల్గొన్నారు.

ప్రింటర్ వితరణ



ప్రింటర్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థి, తదితరులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలకు పూర్వ విద్యార్థి ప్రణయ రూ.25 వేల గల ప్రింటర్‌ను అందించింది. ఇటీవల ఉద్యోగం సాధించిన ఆమె తాను చదువుకున్న పాఠశాలకు తనవంతుగా ప్రింటర్ అందించినట్లు తెలిపారు. సరస్వతి విద్యాపీఠం జిల్లా అధ్యక్షుడు అనిత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, పాఠశాల కార్యదర్శి వేణు గోపాల్, సభ్యులు మధుకర్, సంతోష్, శారదా తల్లిదండ్రులు పాల్గొన్నారు.

‘దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి’

ఆసిఫాబాద్: జైనూర్ మండల కేంద్రంలో ఆదివాసీ యువకుడిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుం దెబ్బ) జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదివాసీ యువకుడిపై ఏజెన్సీ ప్రాంతంలో ఉంటున్న ఓ వర్గం వారు విచక్షణారహితంగా దాడి చేసి యావత్ ఆదివాసీ సమాజాన్ని అవమానపరిచారని పేర్కొన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ ఆదివాసీల ఆధ్వర్యంలో శుక్రవారం ఉట్నూర్ ఐటీడీఏ అధికారి వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఆదివాసీలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఎస్సైకి ఫిర్యాదు

జైనూర్: మండల కేంద్రంలో ఈనెల 13న జరిగిన ఇరు వర్గాల ఘర్షణ విషయం తెలిసిందే. ఈ ఘర్షణ సమయంలో ఫొటో, వీడియో తీస్తున్న క్రమంలో జర్నలిస్టులపై దాడి చేసి సెల్‌ఫోన్లు ధ్వంసం చేసినవారిపై శిక్షించాలని ట్రైబల్ జర్నలిస్టు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్సై సందీప్‌కుమార్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. అధ్యక్షుడు రమేశ్, ఉపాధ్యక్షుడు ఆత్రం రాము, ట్రెజరరీ జాదవ్ వసంత్, సురేష్, గేడం దత్తా, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాందేవ్, సుధామ్ ఉన్నారు.